## క్లుప్తంగా

### పాత వంతెన తొలగింపు పనుల పరిశీలన



**ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండల పరిధిలోని దాలిపర్రు వద్ద చేపట్టిన పాత వంతెన, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. గత నాలుగు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు దాలిపర్రు పాత వంతెన వద్ద పెద్ద ఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోయింది. మురుగు పోయేందుకు గుర్రపు డెక్క, పాత వంతెన ఆటంకంగా మారడంతో ఈ సమస్యను రైతులు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పలుగుల గండి వద్ద ఉన్న పాత వంతెన, గుర్రపు డెక్క తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో జేసీబీ ద్వారా పాత వంతెనను తొలగించడంతో మురుగు పారుదల సమస్య తీరింది. పనులను ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావుతో పాటు పలువురు అధికారులు, పార్టీ నాయకులు పర్యవేక్షించారు.

### ముమ్మరంగా వరినాట్లు



**కృత్తివెన్ను:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు తిరిగి ఊపందుకున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 7,500 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారని ఏఓ జెన్నీ తెలిపారు. వర్షాలకు తోడు పంట కాలువలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు పూర్తిగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. సుమారు 60 శాతం భూముల్లో రైతులు వెద పద్ధతిలో సాగు చేపట్టగా మిగిలిన 40 శాతం భూముల్లో నాట్లు వేస్తున్నారు. వెద పద్ధతిలో గతాని కంటే ఇప్పుడు కలుపు నివారణకు వివిధ రకాల మందులు అందుబాటులో ఉండటంతో తక్కువ ఖర్చుతో సాగు పూర్తి చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

### రేపు జాబ్ మేళా

**కైకలూరు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో కైకలూరు–ఏలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం ఉదయం జాబ్ మేళా జరుగుతుందని విజ్ఞాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ జి.రంగారావు శనివారం తెలిపారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 1,200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బి.టెక్ విద్యార్హతతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు.

# రుధిర తర్పణం

- కర్బలా అమరవీరులకు రక్తంతో నివాళి
- నగరంలోని షియా ముస్లింల చెస్ట్‌బీట్

**మచిలీపట్నంటౌన్:** కర్బలా మైదానంలో వీర మరణం పొందిన అమర వీరులను స్మరిస్తూ షియా ముస్లింలు శనివారం నగరంలో రుధిర తర్పణం చేశారు. మొహమ్మద్ ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తో పాటు 72 మంది సమస్త మానవాళి కోసం కర్బలా మైదానంలో జరిగిన పవిత్ర యుద్ధంలో వీరమరణం పొందారు. వారిని స్మరిస్తూ నగరంలోని షియా ముస్లింలు దుఃఖ దినాలను ఆచరించారు. దీనిలో భాగంగా 11వ రోజైన శనివారం మొహర్రంను నిర్వహించారు. నగరంలోని షియా ముస్లింలు కోనేరు సెంటర్‌కు చేరుకుని చెస్ట్ బీటింగ్ నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వయస్సుతో నిమిత్తం లేకుండా చెస్ట్ బీటింగ్ ద్వారా రక్తాన్ని చిందించి నివాళులర్పించారు. చిన్న పార్టీ, పెద్ద పార్టీ ఆధ్వర్యంలో వేర్వేరుగా చెస్ట్ బీటింగ్ చేశారు. చిన్నారుల నుదుటిపై కత్తితో గాటు పెట్టి రక్తం చిందించి నివాళులర్పించారు. చెస్ట్ బీటింగ్‌లో పాల్గొన్న ముస్లింలు యా హుస్సేన్.. యా హుస్సేన్ అంటూ పెద్ద పెట్టున నినదిస్తూ రక్తతర్పణ చేశారు. తొలుత నగరంలోని పంజాల నుంచి పీర్లను కర్బలా మైదానానికి ఇమామ్ హుస్సేన్ సైన్యం వెళ్లిన మాదిరిగా గుర్రాలతో ర్యాలీగా కోనేరు సెంటర్‌కు చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా పీర్లకు దట్టీ సమర్పించారు. పేర్ని కిట్టు, 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, షేక్ మొహమ్మద్ సాహెబ్, వైఎస్సార్ సీపీ గ్రీవెన్ సెల్ జిల్లా కన్వీనర్ కరార్ మూసవి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, నజాఫ్‌అలీ, మోహసిన్, ఎండీ సద్రుద్దీన్ తదితరులు చెస్ట్‌బీట్‌లో పాల్గొని రక్తం చిందిస్తున్న ముస్లింలకు నీళ్లు చల్లి ఉపశమనం కలిగించారు. చిన్నారులకు నుదుటిన గాట్లు పెట్టడంతో ఏర్పడిన గాయానికి కట్లు కట్టేందుకు పేర్ని కిట్టు సహకరించారు. ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో చెస్ట్ బీటింగ్‌లో పాల్గొన్న వారికి వైద్యసేవలు అందించారు. కోనేరు సెంటర్‌కు చేరుకున్న ముస్లింలకు పేర్ని కిట్టు అన్నదానం చేశారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కోనేరు సెంటర్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. నగరంలోని పలు పంజాల పీర్లను నగరంలో ఊరేగించారు. అనంతరం పీర్లను మళ్లీ పంజాలకు చేర్చారు. పీర్ల ఊరేగింపులో పాల్గొన్న వారికి నగరంలోని పలు కూడళ్ల వద్ద అన్న సమారాధన, మజ్జిగ పంపిణీ చేశారు.



కోనేరు సెంటర్‌లో చెస్ట్ బీటింగ్ ద్వారా రక్తతర్పణ చేస్తున్న ముస్లింలు (ఇన్‌సెట్) పీర్లకు దట్టీ సమర్పిస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో సలార్‌దాదా, విఠల్

#### ప్రత్యేక ప్రార్థనలు

**బంటుమిల్లి:** స్థానిక జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు జాఫర్ హుస్సేన్ మొహర్రం ప్రాముఖ్యతను వివరించారు. మొహర్రం సందర్భంగా పలువురు ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు దర్గాను సందర్శించేందుకు పయనమై వెళ్లారు. వీరికి బంధువులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాల్లో మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**చల్లపల్లి:** ప్రపంచ శాంతి కోసం హసన్–హుసేన్ ప్రాణ త్యాగాలకు స్మరించుకుంటూ ముస్లింలు మొహర్రం సంతాపదినం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం స్థానిక తూర్పువైపు, పడమర వైపు ఇస్లాం నగర్‌లలో పీర్ల పంజా ఆస్థానాల వద్ద మొహర్రం సందర్భంగా పీర్లకు ప్రత్యేక ధుని, గంధం సమర్పించారు. పీర్లకు అలంకరణ చేసి వీధుల్లో ఊరేగించారు. ముస్లిం యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

**పెడన:** పట్టణ పరిధిలోని పలు జెండా కూడళ్లు, పీర్ల పంజా వద్ద ముస్లింలు మొహర్రంను నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల జెండా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పీర్లను ఊరేగించి పలు కూడళ్ల వద్ద జెండాలు నిలిపి దుఃఖదినాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో మసీద్ కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



జుల్‌జనా ఊరేగింపు



జులాను మోస్తూ ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

## ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే సింహాద్రి పర్యటన

**అవనిగడ్డ:** అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మండల పరిధిలోని పులిగడ్డ అక్విడెక్టును ఆయన పరిశీలించి అక్విడెక్టు చివర లీకవుతున్న చోట మరమ్మతులు చేయించారు. పాత ఎడ్లంకలో వరద పరిస్థితిని పరిశీలించారు. పాత ఎడ్లంకలో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పడవ దాటేటప్పుడు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది వరద తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎవరూ నదిలోకి దిగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, మాజీ సర్పంచ్‌లు సైకం బాబూరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎడ్లంకలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

## రైతుల కష్టాలపై స్పందించే నేత జోగి రమేష్

### టీడీపీ నేతల ఆరోపణలకు ఖండన

**గూడూరు:** రైతులకు ఏ కష్టమొచ్చినా వెంటనే స్పందించే నాయకుడు మంత్రి జోగి రమేష్ అని వైఎస్సార్ సీపీ గూడూరు మండల నాయకులు అన్నారు. గూడూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, ఎస్ ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు శనివారం విలేకరులతో మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు మన రాష్ట్రంతో పాటుగా హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాలు మునిగి పోయాయన్నారు. ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో డెల్టాలోని పంట పొలాల్లో కూడా నీరు నిలిచిందన్నారు. మంత్రి జోగి రమేష్ కుండ పోత వర్షాన్ని సైతం లెక్క చేయకుండా డ్రెయినేజీ అధికారులను తన వెంట గ్రామాలకు తీసుకువచ్చి పరిస్థితిని స్వయంగా పరిశీలించారని, మురుగుకాల్వల్లో గుర్రపు డెక్క, తూడును యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారని చెప్పారు. ప్రతి రోజూ జరుగుతున్న పనులను స్వయంగా సమీక్షిస్తున్నారన్నారు. రైతుల కోసం ఇంతగా ఆలోచిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. డెల్టాలోని రైతులకు గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మేలుకు నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలుపై బహిరంగ చర్చకు సిద్ధమని వారు సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు చేస్తున్న చవకబారు ఆరోపణల్లో ఏ మాత్రం పసలేదన్నారు. డీసీ చైర్మన్‌గా పోతన స్వామి ఉన్నప్పుడు జరిగిన అవకతవకలు, అక్రమాలను త్వరలోనే బయటపెడతామని తెలిపారు. మరోసారి మంత్రి జోగి రమేష్‌పై కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కానీ అసత్య ప్రచారాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, మాజీ డీసీ చైర్మన్ గమిని కృష్ణ, రామరాజుపాలెం సర్పంచి పరసా రాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**గుడివాడటౌన్:** ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని 3, 17వ వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. స్థానిక 3వ వార్డులోని 34వ సచివాలయంలో జరిగిన సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొని ప్రసంగించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు సర్వే నిర్వహించి, అవసరమైన వారికి 11 సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం 43 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, నాయకులు దుడ్డు చిన్నా, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్థానిక 17వ వార్డులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు పాల్గొన్నారు. 731 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి దారం కాంచన పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**లక్ష్మీపురం(చల్లపల్లి):** చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరం తోటవారి బజారులో శనివారం నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్ నిధులు రూ.5 లక్షలతో 112 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించనున్నారు. నిర్మాణ పనులకు ద్వారకానాథ్ పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని), ఎంపీటీసీ ఎస్.వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు తోట దుర్గాప్రసాద్, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యతోనే బంగారు భవిష్యత్

### ఎస్ఐ శ్రీనివాస్

**ఘంటసాల(అవనిగడ్డ):** విద్యతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ అన్నారు. ఘంటసాల మండల పరిధి శ్రీకాకుళం ఎస్సీ బాలికల వసతిగృహంలో శనివారం విద్యార్థినులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులు గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడరాదని, చాటింగ్‌లు చేయవద్దని చెప్పారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థినులను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలని, ప్రవర్తనలో ఏదైనా మార్పు వస్తే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వార్డెన్‌కు, లేదంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దిశ యాప్, డయల్ 100పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తొలుత ఆయన వసతిగృహాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు వసతిగృహ విద్యార్థినులకు పుస్తకాల కోసం రూ.2 వేల నగదును అందించారు. గ్రామానికి చెందిన తుంగల సుగుణమ్మ వసతి గృహానికి మిక్సీని అందించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

### శాంతి ర్యాలీని విజయవంతం చేయండి

**ఘంటసాల(అవనిగడ్డ):** మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండకు నిరసనగా ఘంటసాల మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన నిర్వహించనున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని ఫెలోషిప్ ప్రతినిధులు కోరారు. స్థానిక కార్యాలయం వద్ద శనివారం ఫెలోషిప్ నాయకులు కె. వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ఉదయం 7 గంటలకు బైక్ ర్యాలీ ఘంటసాలలో ప్రారంభమై చల్లపల్లి మీదుగా మచిలీపట్నం చేరుతుందని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఫెలోషిప్ నాయకులు ఎస్. సుందర్‌సింగ్, ఎన్. జాకబ్, కె. ఏసుముత్యాలు, కె. సతీష్‌పాల్, సీహెచ్ దానియేల్, జీవన్, మోషే, ఏసు, యేషయా, పాస్టర్లు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత

**మచిలీపట్నంటౌన్:** 25వ డివిజన్ సర్కిల్‌పేటకు చెందిన కొణతం నాగమల్లేశ్వరరావు కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగమల్లేశ్వరరావుకు లివర్ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. లివర్ మార్పిడి శస్త్రచికిత్స ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకపోవడంతో ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయించాలని డివిజన్ కార్పొరేటర్ కొలుసు విజయగంగ, నాయకులు కొలుసు హరిబాబు ఎమ్మెల్యే పేర్ని నానిని కోరారు. ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 10 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. మంజూరు పత్రాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) నాగమల్లేశ్వరరావుకు శనివారం అందజేశారు. తన శస్త్రచికిత్సకు రూ. 10 లక్షలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నానికి నాగమల్లేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



నాగమల్లేశ్వరరావుకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న పేర్ని కిట్టు

## విద్యుత్ మీటర్లను ఇంటి బయట అమర్చాలి

**కైకలూరు:** విద్యుత్ మీటర్లను వినియోగదారులు ఇంటి, దుకాణం బయట ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ గుడివాడ ఈఈ టి.రామకృష్ణ చెప్పారు. కైకలూరు విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయంలో మీటర్లపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు ప్రతి నెలా బిల్లులు పారదర్శకంగా ఇవ్వడానికి మీటర్లను స్కానింగ్ చేసి రీడింగులు నమోదు చేయిస్తున్నామన్నారు. కొంత మంది మీటర్లను షాపులు, ఇళ్ల లోపల అమర్చడం వల్ల నెలవారీ మీటర్ రీడింగ్ స్కానింగ్ చేయుటకు సాధ్యం కావడం లేదన్నారు. సిబ్బంది రీడింగ్ నమోదు చేసే సమయంలో వినియోగదారులు అందుబాటులో లేకుంటే తదుపరి బిల్లులో రెండు మూడు నెలలకు ఒకేసారి రీడింగ్ నమోదు చేయుట వలన బిల్లులో వ్యత్యాసం వచ్చే అవకాశం ఉందన్నారు. తాత్కాలికంగా విద్యుత్ వినియోగం లేనప్పటికీ మీటర్‌ను స్కానింగ్ చేసి బిల్లు ఇస్తామన్నారు. ఏదైనా కారణంచే స్కానింగ్ కాకుంటే, ఆ మీటర్లను ప్రత్యేక తనిఖీ అధికారులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఎక్కువ కాలం వినియోగం లేకుంటే, సర్వీసును రద్దు చేసుకుని, తిరిగి అవసరమైనప్పుడు వెంటనే కొత్త సర్వీసును పొందే అవకాశం ఉందని తెలిపారు. దీని వలన వినియోగించని కాలానికి అనవసరంగా మినిమం చార్జీలు చెల్లించాల్సిన భారం ఉండదన్నారు. విద్యుత్ బిల్లు ఇచ్చిన 14 రోజులలోపు చెల్లించే వారికి అదనంగా ఎటువంటి సర్ చార్జీలు ఉండవన్నారు. 30 రోజుల్లోపు చెల్లించని సర్వీసులకు వెంటనే సరఫరా నిలిపివేస్తామన్నారు. 60 రోజుల తర్వాత మీటర్ తొలగించి, సర్వీసును శాశ్వతంగా రద్దు చేస్తామని చెప్పారు. వర్షాకాలంలో చెరువులపై విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా లేకుండా, 8 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. సరైన అవగాహన, నైపుణ్యం లేనివారితో విద్యుత్ పరికరాలను రిపేర్లు చేయించరాదన్నారు. డీఈఈ రామయ్య, ఏఈలు శ్రీనివాసమూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఖురాన్‌ను దహనం చేయడంపై నిరసన

**మచిలీపట్నంటౌన్:** స్వీడన్ దేశం స్టాక్‌హోమ్ నగరంలోని ప్రధాన మసీదు వద్ద బక్రీద్ రోజున అత్యంత పవిత్రమైన ఖురాన్‌ను చించి కాల్చివేయడంపై నగరంలోని షియా ముస్లింలు నిరసన తెలిపారు. డెన్మార్క్‌లోని ఇరాక్ విదేశీ రాయబార కార్యాలయం వద్ద ఖురాన్‌ను దహనం చేసిన ఘటనలపై గిరోహే మీరన్ షా సాహెబ్ సంస్థ ఆధ్వర్యంలో కోనేరు సెంటర్‌లో చెస్ట్ బీటింగ్‌కు వచ్చిన ముస్లింలు ఖురాన్‌ను తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేలా ఆయా దేశాలపై ఒత్తిడి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాన్ని మీర్ ఇనాయత్ హుస్సేన్ అల్ హుస్సైని పర్యవేక్షించారు.



కోనేరు సెంటర్‌లో ఖురాన్‌ను తలపై ఉంచుకుని నిరసన తెలుపుతున్న ముస్లింలు

## మణిపూర్ మృతులకు నివాళి

**మచిలీపట్నంటౌన్:** మణిపూర్‌లో హత్యకు గురైన క్రైస్తవ మహిళలకు నగరంలోని క్రైస్తవ సంఘ సేవకులు శనివారం ఘన నివాళులర్పించారు. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ (యూపీఏ) ఆధ్వర్యంలో స్థానిక చాకిరేవుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో యూపీఏ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జి. ఏబేలు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ మహిళలను వివస్త్రలను చేసి రోడ్లపై తిప్పి దాడి చేసి హతమార్చడం దారుణమన్నారు. ఆ రాష్ట్రంలో క్రైస్తవుల ప్రాణాలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూపీఏ మచిలీపట్నం కార్యదర్శి ఎల్. వాల్టర్స్ మాట్లాడుతూ లౌకిక భారతదేశంలోని ఓ రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), వైఎస్సార్ సీపీ నాయకుడు బందెల థామస్ నోబుల్, యూపీఏ మచిలీపట్నం కోశాధికారి చాట్ల వెస్లీ, ఉపాధ్యక్షుడు థామస్ అబ్రహాం, పాస్టర్లు పరంజ్యోతి, ఎజ్రా దానియేల్, జక్రాయాస్, డానియేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## 120 మంది వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు

**కంకిపాడు:** కళ్లను నిర్లక్ష్యం చేయొద్దని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. కంకిపాడు –3 సచివాలయ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో శనివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 120 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు, పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సర్కారు కాల్వ వంతెనపై భారీ వాహనాల నిషేధం

**కైకలూరు:** భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి కొల్లేరుకు చేరుతున్న నీటితో పందిరిపల్లిగూడెం సర్కారు కాల్వ వద్ద నీటి ఒరవడి శనివారం పెరిగింది. ఇటీవల నిర్మించిన నూతన వారధి నిర్మాణం ర్యాంప్‌పై నుంచి నీరు ఇనుప వంతెన దాటి వెళుతోంది. దీంతో రూరల్ ఎస్ఐ జ్యోతి బాస్ వంతెన వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇనుప వంతెనపై కేవలం బాటసారులు, ద్విచక్ర వాహనదారులు మాత్రమే ప్రయాణించాలన్నారు. భారీ వాహనాలను నిషేధించామన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి ఆదివారం వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

**గుడివాడటౌన్:** స్థానిక దనియాలపేటలోని రజక కాలనీలో నీట మునిగిన ప్రాంత ప్రజలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు ఆధ్వర్యంలో సరుకులను ఆర్ఐ నాగబాబు అందించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మురళి, చుండూరి శేఖర్, కన్వీనర్లు పాపారావు, శ్రీనివాస్, రమీజా, వినయ్ పాల్గొన్నారు.